సాక్షి రంగారెడ్డి

మంగళవారం ◆ 4 ◆ జూన్ ◆ 2024



చేవెళ్ల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

నేడే తీర్పు ఎవరిదో గెలుపు!



ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

- చేవెళ్ల ఎంపీ బరిలో 43 మంది అభ్యర్థులు
- ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ భద్రత

సాక్షి,రంగారెడ్డిజిల్లా/చేవెళ్ల: సార్వత్రిక ఎన్ని కల ఓట్ల లెక్కింపు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. మరికొద్ది గంటల్లో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో బరిలో నిలిచిన అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు తమ పోలింగ్ ఏజెంట్లతో లెక్కింపు కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇందుకోసం జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పా ట్లు చేసింది.చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. మొత్తం 43 మంది అభ్యర్థులు చేవెళ్ల లోక్‌సభ బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వ ర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోటీ చేశారు. వీరిలో విజేతలెవరో? పరాజితులెవరనేది మధ్యాహ్నం రెండు గంటల్లోగా తేలే అవకాశం ఉంది.

పాసులున్న వారికే అనుమతి

ఓట్ల లెక్కింపునకు 671 మంది సిబ్బందిని ఎంపిక చేశారు. వీరిలో కొంత మంది ఇప్పటికే కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్నారు. మరికొంత మంది మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు రిపోర్టు చేయనున్నారు. ఉదయం 6 గంటలకు మూడో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి, నియోజకవర్గాల వారీగా లెక్కింపు సిబ్బందిని కేటాయించనున్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యా లెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. లెక్కింపు కేంద్రం చుట్టూ మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలోకి ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాసులున్న వారిని మినహా ఇతరులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోరు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్‌కు అనుమతి నిరాకరించనున్నారు. ఓట్ల లెక్కింపు వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు వెల్లడించేందుకు ప్రత్యేక కౌంటర్‌ఏర్పాటు చేశారు. కౌటింగ్ కేంద్రంలో భారీ ఎల్‌సీడీ‌లు సిద్ధం చేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్ కుమార్ కటారియా, కౌంటింగ్ పరిశీలకులు మృణాళిని సావంత్, వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి జిల్లా రిటర్నింగ్ అధికారి శశాంక సోమవారం ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్ కుమార్ కటారియా, రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

ఏర్పాట్లు పూర్తి

బీఎస్‌ఐటీ కళాశాలలోకి ప్రవేశించగానే కౌంటింగ్‌కోసం వచ్చే ఏజెంట్లు సిబ్బంది వేళ్లేందుకు వీలుగా బ్లాక్‌ల వారీగా కౌంటింగ్ కేంద్రాలు తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేశారు. ఏజెంట్లు, సిబ్బందికి ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌కు సంబంధించి గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బందోబస్త్‌లో ఏడుగురు ఏసీపీలు, 16 మంది సీఐలు, 41 మంది ఎస్‌ఐలు, 80 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, 250 మంది కానిస్టేబుళ్లు, 40 మంది మహిళా కానిస్టేబుళ్లు, వీరితోపాటు ప్రత్యేక సీఆర్‌పీఎఫ్ కలిపి దాదాపు 700 మంది బందోబస్త్ నిర్వహిస్తున్నట్లు వివరించారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుపై మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

కౌంటింగ్ ఏర్పాట్లు ఇలా..

నియోజకవర్గం	ఓట్ల లెక్కింపు	టేబుళ్లు	రౌండ్లు	సిబ్బంది
మహేశ్వరం	బ్లాక్ బి. 1వ అంతస్తు	28	20	87
రాజేంద్రనగర్	బ్లాక్ ఎ. 2వ అంతస్తు	28	20	87
శేరిలింగంపల్లి	బ్లాక్ బి. గ్రౌండ్ ఫ్లోర్	28	23	87
చేవెళ్ల	బ్లాక్ ఎ.1వ అంతస్తు	14	22	45
పరిగి	బ్లాక్ బి.2వ అంతస్తు	14	22	45
వికారాబాద్	బ్లాక్ బి. 2వ అంతస్తు	14	21	45
తాండూరు	బ్లాక్ బి. 3వ అంతస్తు	14	20	45
పోస్టల్ బ్యాలెట్	బ్లాక్ ఎ. 1వ అంతస్తు	25	2	78

మధ్యాహ్నానికి అంచనా..

ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 165 టేబుళ్లు ఏర్పాటు చేశారు. అత్యధికంగా శేరిలింగం పల్లిలో 23 రౌండ్లు, చేవెళ్ల, పరిగి 22, మహేశ్వరం, రాజేంద్రనగర్ 20 రౌండ్ల చొప్పున లెక్కింపు ఉంటుంది. వికారాబాద్ 21, తాండూరు 20 రౌండ్ల చొప్పున లెక్కింపు జరుగుతుంది. తొలి రౌండ్ ఫలితం ఉదయం 9.30 గంటలకు వెలువడే అవకాశం ఉంది. ఆ తర్వాత ప్రతి అర గంటకు ఒక రౌండ్ ఫలితం తేలనుంది. మధ్యాహ్నం రెండులోగా అభ్యర్థుల గెలుపు, ఓటముల ట్రెండింగ్‌పై ఓ అంచనాకు వచ్చే ఛాన్స్ ఉంది. సాయంత్రంలోగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగియనుంది.

వాహనాల దారి మళ్లింపు

చేవెళ్ల–శంకర్‌పల్లి రోడ్డులోని గొల్లపల్లి సమీపంలో ఉన్న బీఎస్‌ఐటీ కళాశాలలో కౌంటింగ్ ఉండటంతో ఈ రోడ్డుపై వచ్చే వాహనాలను దారి మళ్లించనున్నట్టు చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. చేవెళ్ల నుంచి ఊరేళ్ల మీదుగా ఎన్కేపల్లి చౌరస్తాలో కలిసి శంకర్‌పల్లికి వెళ్లేలా మళ్లింపు ఉంటుందన్నారు. భారీ వాహనాలు మాత్రమే ఈ ప్రధాన రోడ్డు వెంట వెళ్తాయని, ఇతర వాహనాలన్నీ దారి మళ్లించిన వైపు నుంచే వెళ్లాల్సి ఉంటుందన్నారు. శంకర్‌పల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు అదే రోడ్డులో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో, చేవెళ్ల వైపు నుంచి వచ్చే వాహనాలు అదే రోడ్డువైపు ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో వాహనాలు నిలపాలని సూచించారు.

న్యూస్‌రీల్

విద్యుత్ సమస్యలపై ఆందోళన



సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎన్కేపల్లి గ్రామస్తులు

చేవెళ్ల: గ్రామంలో కరెంట్ సమస్యలున్నాయని చెప్పినా పట్టించుకోవటం లేదంటూ మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామస్తులు సోమవారం ఈర్లపల్లి విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లైన్‌మన్ భిక్షపతి తీరుతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామంలో అనేక విద్యుత్ సమస్యలు ఉన్నాయని, వాటిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తమకు కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న ఏడీ స్వామి, ఏఈ నయీమొద్దీన్ వెంటనే స్పందించి సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తామని వారికి నచ్చజెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

విద్యార్థులకు సకాలంలో యూనిఫాం

డీఆర్‌డీఓ శ్రీలత



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

నందిగామ: పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న తరుణంలో విద్యార్థులకు సకాలంలో యూనిఫాం అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ భవనంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని 31 పాఠశాలకు గాను 1,868 యూనిఫాంలు కుట్టేందుకు సంఘాలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆయా సంఘాల సభ్యులు పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి వాటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, ఏపీఎం యాదగిరి, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లు పెంచాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం నిర్వహించిన ఆ సంఘం నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలకు పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి ఆరునెలలు గడిచినా అమలుకు నోచుకోలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు మాట్లాడకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్ల పెంపు కోసం ఉద్యమించనున్నట్లుజంగయ్య స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు యాదయ్య, శ్రీనివాస్, బాల్‌రాజు, సంజీవ, సురేస్, రవి పాల్గొన్నారు.

స్టూడెంట్ బస్‌పాస్‌లకు ఏర్పాట్లు

- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులకు ఆహ్వానం
- గ్రేటర్‌లోని అన్ని కౌంటర్ల ద్వారా పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల బస్‌పాస్‌లకు ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. త్వరలో విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న దృష్ట్యా వివిధ రకాల పాస్‌లను అందజేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఏడో తరగతి వరకు చదివే బాలురకు ఉచిత పాస్ సదుపాయం లభించనుంది. ఇప్పటికే బాలికలకు ఫ్రీ బస్ సదుపాయం ఉన్న దృష్ట్యా ప్రత్యేకంగా పాస్‌లు అవసరం ఉండవు. ఒకవేళ ఉచిత పాస్‌లు పొందాలనుకొంటే పదోతరగతి వరకు అమ్మాయిలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. మరోవైపు సకాలంలో అడ్మినిస్ట్రేటివ్ ఫీజులు చెల్లించిన విద్యాసంస్థలకు మాత్రమే బస్‌పాస్ సదుపాయం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు.. తమ ఆఫ్‌లైన్ దరఖాస్తులపై సంబంధిత విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సంతకం తీసుకొని సమీప బస్‌పాస్ కౌంటర్లలో అందజేసి పాస్‌ను పొందొచ్చు. సాధారణ నెలవారి విద్యార్థి బస్‌పాస్‌కు రూ.400, మూడు నెలలకు రూ.1,200 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. సిటీరూట్ పాస్‌కు 4 కిలోమీటర్ల కనిష్ట దూరానికి రూ.450 నుంచి 22 కిలోమీటర్ల గరిష్ట దూరానికి రూ.1,350 వరకు చెల్లించాల్సి ఉంటుంది. గ్రేటర్ స్టూడెంట్ పాస్‌కు రూ.470, గ్రేటర్ స్టూడెంట్ క్వార్టర్లీ పాస్‌కు రూ.1,410 చొప్పున చార్జీలు ఉంటాయి. విద్యార్థుల అవసరాల మేరకు ఎక్స్‌క్లూజివ్ ఆర్డినరీ పాస్‌కు రూ.1,020, మెట్రో పాస్‌కు రూ.1,190 చొప్పున చెల్లించాలి.

విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు

బస్‌పాస్‌ల కోసం విద్యాసంస్థలు ఆన్‌లైన్ ద్వారా అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించొచ్చు. దరఖాస్తులను సైతం ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలి. కొత్తగా బస్ పాస్ కోడ్ పొందే ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు రూ.7,000 చెల్లించాలి. పాత కళాశాలలు రూ.6000 చొప్పున చెల్లించి రెన్యూవల్ చేసుకోవచ్చు. సాధారణ డిగ్రీ, పీజీ కళాశాలలు కొత్తవి రూ.6,000, పాతవి రూ.5,000 చొప్పున, ఒకేషనల్ కాలేజీలు కొత్తవి రూ.5,000, పాతవి రూ.4,000 చొప్పున, స్కూళ్లు కొత్తవి రూ.3,000, పాతవి రూ.2,000 చొప్పున చెల్లించి బస్‌పాస్ కోడ్ పొందొచ్చు.



సాగుబాట

ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు సోమవారం ఉదయం తమ పొలాల్లో విత్తనాలు వేసుకున్నారు. పక్షం రోజుల క్రితం కురిసిన స్వల్ప వర్షానికి పొలాలను సిద్ధం చేసుకున్నారు. రోహిణి కార్తెలో మెట్ట పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని అన్నదాతల నమ్మకం.

– యాచారం

ఆలయంలో హుండీ చోరీ

- వరుస ఘటనలతో జంకుతున్న స్థానికులు
- కొరవడిన పోలీసుల నిఘా


నగదు తీసుకుని పడేసిన హుండీ

మొయినాబాద్: వరుస చోరీలు స్థానికులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఏకంగా దేవుని గుడిలో హుండీలకే రక్షణ లేకుండా పోయింది. దుండగులు ఆలయంలోని హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో హుండీ ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీని బయటకు తీసుకెళ్లారు. పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల వీధిలో హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఆలయంలో హుండీ లేదని గమనించిన గ్రామస్తులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. పాఠశాల పక్కన హుండీ పడి ఉంది. అక్కడే కొన్ని చిల్లర నాణేలు పడి ఉన్నాయి. నోట్లు ఎత్తుకెళ్లిన దుండగులు చిల్లరను అక్కడే వదిలేశారు. ఈ విషయమై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇరవై రోజుల్లోనే నాలుగు ఘటనలు

మొయినాబాద్ మండలంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. గత నెల రోజుల్లోనే నాలుగు చోరీలు జరిగాయి. ఇరవై రోజుల క్రితం మండల కేంద్రంలోని అపోలో ఫార్మసీ ఎదురుగా రోడ్డు పక్కన పార్కు చేసిన బైక్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. పది రోజుల క్రితం మండల కేంద్రంలోని సిద్ధార్థ కళాశాల భవనంలో ఇద్దరు మహిళలు ఇంట్లోకి చొరబడి బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. ఇదంతా సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. మూడు రోజుల క్రితం సురంగల్ గ్రామ సమీపంలో ఉన్న కట్టమైసమ్మ దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లారు. తాజాగా ఆదివారం అర్ధరాత్రి దుండగులు నాగిరెడ్డిగూడలోని హనుమాన్ దేవాలయంలో హుండీని పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. రెండు దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నా అవి పనిచేయడం లేదు. మండలంలో వరుస చోరీలు జరగడంపై ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసుల నిఘా సరిగా లేకపోవడం వల్లే దొంగలు రెచ్చిపోతున్నారని ఆరోపిస్తున్నారు. పోలీసులు ఇప్పటికైనా నిఘా పెంచి దొంగతనాలకు చెక్ పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రూ.5లక్షల నగదు అపహరణ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో మంచాల రోడ్డులో కిరాణా దుకాణంలో దొంగలు పడి రూ.5లక్షల నగదు, తులం బంగారం చోరీకి గురయ్యాయి. జి.నాగేష్, భార్య పద్మావతి.. ఇద్దరూ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ నెల 1న హైదరాబాద్ వెళ్లి.. ఆదివారం తిరిగి వచ్చారు. ఇంటికి తిరిగి వచ్చే సరికి.. తలుపు గడియ విరగగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా.. రూ.5లక్షల నగదు, తులం బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


శివ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్ కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలంలోని కావలిగుండు తండాకు చెందిన శివ(19) కొంత కాలంగా శంషాబాద్ మండలం మదన్‌పల్లి పాతతండాలోని అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. శివ ఆదివారం ఉదయం బైక్‌పై పని నిమిత్తం జడ్చర్లకు బయలుదేరాడు. తిరుగు ప్రయాణంలో ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ సమీపంలోగల బస్టాప్ వద్దకు రాగానే శివ బైక్‌తో ముందు వెళుతున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని లిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శివను ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న అతడు సోమవారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

‘ధరణి’ పేరుతో వేధిస్తున్నారు


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

- 35 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లను కూల్చేస్తామని నోటీసులిచ్చారు
- కేతిరెడ్డిపల్లి వాసుల ఆవేదన
- న్యాయం చేయాలని ఎంపీడీఓకు మొర

మొయినాబాద్ రూరల్: ఏళ్ల తరబడి స్థిర నివాసం ఏర్పరుచుకొని, గ్రామ పంచాయతీకి పన్నులు సైతం చెల్లిస్తున్న తమను ధరణి పేరుతో వేధించడం తగదని కేతిరెడ్డిపల్లివాసులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ సంధ్యకు వినతి పత్రం అందజేశారు. బాధితుల కథనం ప్రకారం.. కేతిరెడ్డిపల్లిలో 1991 సంవత్సరంలో సర్వే నంబర్ 255 నందు 37 ప్లాట్లు చేశారు. పట్టాదారుడైన సయ్యద్ మహబూబ్ 15 ప్లాట్లను స్థానికులకు విక్రయించారు. అప్పట్లోనే వారు అక్కడ ఇళ్లను కట్టుకున్నారు. పంచాయతీ ద్వారా ఇంటి నంబర్లు రాగా పన్నులు సైతం చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ కాలనీలో రోడ్లు, తాగునీటి నల్లాలు, అండర్ డ్రైనేజీ మురుగుకాలువలు నిర్మించారు.

ఒక్కో ఇంటికి రూ.1–2 లక్షలు ఇవ్వండి

ప్రస్తుతం ఆ భూమిని ధరణి పేరుతో మళ్లీ సయ్యద్ మహబూబ్ కొత్త పాస్‌బుక్‌లు తీసుకుని బాధితులను బెదిస్తున్నారు. ‘ఒక్కో ఇంటికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు ఇవ్వాలి.. లేదంటే మీ ఇళ్లను కూల్చేస్తా’ అని పేర్కొంటూ న్యాయవాది ద్వారా నోటీసులు పంపించారు. 35 ఏళ్లుగా ఇళ్లల్లో మేము ప్రశాంతంగా ఉంటున్నామని, అమ్మిన వ్యక్తి ఇప్పుడు వచ్చి డబ్బులు ఇవ్వాలని బెదిరించడంతో ఏం చేయాలో తోచడం లేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఎంపీడీఓను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడ్ల వెంకటయ్యచారి, శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, వి.రమేష్, సయ్యద్, జాఫర్, లింగమయ్య, రాజు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కులవృత్తులను ఆధునీకరించాలి

విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరిచారి

మీర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం కుల వృత్తులను ఆధునీకరించాలని విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకోజు యాదగిరిచారి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గత పదేండ్ల పరిపాలన ఫలితాలు, అనుభవాలను పరిశీలిస్తే రాష్ట్రంలోని వివిధ కుల వృత్తుల ప్రజలు ఆశించిన స్థాయిలో వృత్తిపనుల ఆధునీకరణ, అభివృద్ధి జరగలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వృత్తిపనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించడంతో పాటు ఆధునిక పద్ధతులతో శిక్షణ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మహానగరంలో కార్పెంటర్, వెల్డింగ్, ప్లంబింగ్, హెయిర్ కటింగ్, లాండ్రీ, జ్యువెల్లరీ, కుండలు, బొమ్మల విగ్రహాల తయారీ తదితర వృత్తులలో స్థానిక వృత్తిదారులకు ఆధునిక శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు.

బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో దశాబ్ది వేడుకలు


జెండావిష్కరణ చేసిన జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

శంషాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది వేడుకలను పట్టణంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేయడంతో పాటు దేశంలో తెలంగాణను నంబర్ వన్‌గా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. అనంతరం తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు గణేష్‌గుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, జెడ్పీటీసీ తన్వీ కౌన్సిలర్లు మేకల వెంకటేష్, కుమార్, అజయ్, రేఖ, విజయలక్ష్మీ, నాయకులు మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బండ్ల గణేశ్‌కు అస్వస్థత

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణేశ్



షాద్‌నగర్ రూరల్: సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ సోమవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. నగరంలోని తన నివాసంలో అనారోగ్యం పాలైన ఆయనను కుటుంబ సభ్యులు అపోలో ఆస్పత్రికి తరలించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

నమూనా రాజ చిహ్నాన్ని పరిశీలించండి


వినతిపత్రం అందించిన అనంతరం కలెక్టరేట్ ఎదుట నాయకులు

డీఎస్‌పీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం

కందుకూరు: తమ పార్టీ ప్రతిపాదిస్తున్న రాష్ట్ర రాజ చిహ్నం నమూనాను పరిశీలించి ఆమోదించేలా చొరవ తీసుకోవాలని డీఎస్‌పీ(ధర్మ సమాజ్ పార్టీ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డీఎస్‌పీ రాష్ట్ర నాయకుడు టి.రవీందర్, జిల్లా కన్వీనర్ అమరేందర్ మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తెలంగాణ చిహ్నాన్ని మార్చాలని నిర్ణయం తీసుకోవడాన్ని తమ పార్టీ స్వాగతిస్తుందన్నారు. కొత్తగా తయారు చేసే చిహ్నంలో తాము సూచిస్తున్న విధంగా ఉస్మానియా యూనివర్సిటీ, రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ అంబేద్కర్, అణగారిన వర్గాల కోసం పోరాటం చేసిన పండగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమక్క, సారలమ్మల చిత్రాలను ఉంచాలన్నారు. దీంతో అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నాగార్జున, పి.శేఖర్, బి.శేఖర్, రంజిత్, భాస్కర్, శ్రీకాంత్, సీహెచ్ అంజయ్య, మహిపాల్, హనోక్, ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్క దాడి

తల్లీకొడుకులకు గాయాలు


గాయపడిన సుగుణమ్మ

తుర్కయంజాల్: వీధి కుక్క ప్రతాపానికి ఓ తల్లీకుమారులు తీవ్రంగా గాయపడ్డారు. తనయుడిని కరిచిన 10 రోజుల్లోనే తల్లిపై సైతం దాడి చేసి రక్త గాయాలు చేసింది. ఈ సంఘటన తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీలో చోటుచేసుకుంది. రామాలయం సమీపంలో అద్దెకు ఉంటున్న బోయ శివను 10 రోజుల క్రితం ఓ వీధి కుక్క కరిచింది. ఆయన మోచేతిపై దాడి చేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. అదే కుక్క తాజాగా సోమవారం శివ తల్లి సుగుణమ్మపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

వీధికుక్క దాడి చేసిన విషయం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం స్పందన కరువైందని స్థానికులు వాపోతున్నారు. 10 రోజుల క్రితం దాన్ని పట్టుకుని ఉంటే సుగుణమ్మపై దాడి ఉండేది కాదని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు ఆరుబయట ఆడుకుంటారు. కానీ కుక్కల బెడదతో అడుగు పెట్టాలన్నా జంకుతున్నారని స్థానికులు తెలిపారు.

అధిక వడ్డీ ఆశ చూపి..


నాగరాజు ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

- రూ.5 కోట్లు టోకరా
- మూడు నెలల క్రితమే నాగరాజుపై కేసు నమోదు
- తప్పించుకు తిరుగుతున్న నిందితుడు

బోడుప్పల్: ఓ వ్యక్తి అధిక వడ్డీ పేరుతో పలువురిని నమ్మించి రూ.5కోట్లు వసూలు చేసి పరారైన సంఘటన మేడిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు సోమవారం నిందితుడి ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. బాధితుల కథనం మేరకు.. గోల్నాకకు చెందిన భాషెట్టి నాగరాజు ఎనిమిదేళ్లుగా బోడుప్పల్ అక్షయ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. యూఎస్‌లో ఆన్‌లైన్‌లో ఫార్మా వ్యాపారం చేస్తున్నట్లు ప్రచారం చేసుకున్న అతను రాఘవేంద్రకాలనీ, అక్షయ్‌నగర్ కాలనీ వాసులతో పరిచయం పెంచుకున్నాడు. అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి పలువురి నుంచి రూ.5 కోట్లపై వసూలు చేశాడు.

రూ. 10 వడ్డీ ఇస్తానని..

రాఘవేంద్ర కాలనీకి చెందిన పలువురు వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుంచి నిందితుడు నాగరాజు అత్యవసరం ఉందంటూ అధిక వడ్డీ ఆశ చూపి అప్పుగా పెద్ద మొత్తం తీసుకున్నాడు. కొందరి నగదు రూపంలో, మరి కొందరి వద్ద క్రెడిట్ కార్డుల ద్వారా సేకరించిన అతను తన బిజినెస్‌కు అప్పుగా ఇస్తే వందకు రూ 8, రూ 10 వడ్డీ ఇస్తానని చెప్పి అందిన కాడికి దండుకున్నాడు.

మూడు నెలలుగా పరారీలో..

తనకు అక్షయ్‌నగర్, రాఘవేంద్ర కాలనీలో రెండు ఇళ్లు ఉన్నాయని చెప్పాడని బాధితులు ఆరోపించారు. ఏడాది క్రితం అప్పు తీసుకున్న వారికి కేవలం మూడు నెలలు మాత్రమే వడ్డీ ఇచ్చి గత అక్టోబర్ నుంచి వడ్డీ కూడా ఇవ్వడం లేదన్నారు. నాలుగు నెలల క్రితం ఇంటికెళ్లి అడిగితే వ్యాపారంలో నష్టం వచ్చింది. మూడు నెలలు సమయం ఇవ్వమని చెప్పి కనిపించకుండా పోయాడని బాధితులు వాపోయారు. గోల్నాక, అంబర్‌పేట ప్రాంతాల్లోనూ అతను పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లు తెలిపారు. బోడుప్పల్‌లో అతడి రెండు ఇళ్లు అమ్మివేసినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపినట్లు బాధితులు వెల్లడించారు.

ఫిబ్రవరిలో ఫిర్యాదు...

నాలుగు నెలల నుంచి నాగరాజు కనిపించకపోవడంతో గత ఫిబ్రవరి 13న మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసి మూడు నెలలు గడిచినా పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకోలేదన్నారు. పోలీసులు నిందితుడి ఆచూకీ కనుగొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పైకి దూసుకెళ్లిన లారీ

తప్పిన ప్రాణాపాయం


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న లారీ

షాద్‌నగర్‌రూరల్: డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ఓ లారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన పట్టణంలోని పరిగి రోడ్డులో గల ట్రెండ్స్ షోరూం ఎదురుగా ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం .. పరిగి వైపు నుంచి షాద్‌నగర్‌కు వస్తున్న లారీ షోరూం సమీపంలోకి రాగానే రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె పూర్తిగా ధ్వంసం కాగా రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కాగా వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.4లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. విద్యుత్ పట్టణ ఏఈ వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

- మున్సిపల్ కమిషనర్ బాలాజీ
- హోటళ్లలో అధికారుల తనిఖీలు


ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ బాలాజీ, అధికారులు

కొత్తూరు: కొత్తూరు పట్టణంలోని పలు హోటళ్లలో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలాజీ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హోటళ్లలో పరిసరాలు, శుభ్రత, ఆహారం నాణ్యతను పరిశీలించినట్లు తెలిపారు. హోటల్ నిర్వాహకులు నిబంధనల మేరకు వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. నిల్వ చేసిన ఆహార పదార్థాలను వేడి చేసి వినియోగదారులకు ఎట్టి పరిస్థితుల్లో అందించవద్దన్నారు. నిబంధనలు పాటించని పలు హోటళ్లకు జరిమానా విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలో పడి డ్రైవర్ గల్లంతు

దుండిగల్: మట్టిని తొలగించే క్రమంలో ఇటాచీతో సహా డ్రైవర్ భారీ గుంతలో పడి గల్లంతైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన గోలం మహమ్మద్(30) దుండిగల్ తాండా–2లో ఉంటూ రాంకీ పరిశ్రమలో ఇటాచీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం పరిశ్రమలో రాళ్లు, మట్టిని ఇటాచీతో తొలగిస్తున్నాడు. పనులు చేస్తున్న క్రమంలో రసాయనాల రీ సైక్లింగ్ కోసం తవ్విన భారీ గొయ్యిలో ప్రమాదవశాత్తు ఇటాచీ పడిపోయింది. డ్రైవర్ క్యాబిన్‌లో ఉన్న మహమ్మద్ అందులోనే చిక్కుకుని గల్లంతు కాగా హెల్పర్ హుస్సేన్ వెనుక క్యాబిన్ నుంచి కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. దుండిగల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మోటర్ల ద్వారా నీటిని తోడుతున్నారు. నీటిని పూర్తిగా తొలగించిన తర్వాతే ఇటాచీతో మహమ్మద్ మృతదేహాన్ని వెలికి తీసే అవకాశం ఉంటుందని పోలీసులు తెలిపారు.